# పొద్దంతా వణుకే

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఉత్తరాది నుంచి శీతల పవనాలు
- పెరుగుతున్న చలి తీవ్రత
- రాత్రీ పగలు లేకుండా ప్రభావం
- మరో మూడు నాలుగు రోజులు ఇదే వాతావరణం
- ఇబ్బందులు పడుతున్న జనం





కరీంనగర్: చలిమంట కాగుతున్న నగరవాసులు

**కొద్ది రోజులుగా చలి విపరీతంగా పెరుగుతున్నది. రాత్రీ పగలు తేడా లేకుండా ప్రభావం చూపుతున్నది. పొద్దంతే కాదు, రాత్రి పూట కూడా గజగజా వణకాల్సి వస్తున్నది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల పవనాలు మరింతగా కూల్ చేస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పడిపోతుండగా, చలి గాలులు భయపెడుతున్నాయి. దీనికితోడు రాత్రి, తెల్లవారుజామున పొగమంచు కురుస్తున్నది. మరో మూడు నాలుగు రోజులు తీవ్రత ఇలాగే ఉండనుండగా, ప్రజానీకం ఇండ్ల నుంచి బయటికి వెళ్లాలంటేనే ఇబ్బంది జంకుతున్నది.**

కరీంనగర్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : డిసెంబర్ మొదటి వారం నుంచే చలి తీవ్రత కనిపిస్తున్నా.. రెండు రోజులుగా మరింత వణికిస్తున్నది. రాత్రీ పగలు తేడాలేకుండా గజగజ వణకాల్సి వస్తున్నది. నిజానికి ఈ నెల 4 నుంచే పగటి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. అంతకు ముందు రోజు 32 డిగ్రీలు ఉన్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా 28కి తగ్గాయి. అప్పటి నుంచి ఇదే పరిస్థితి ఉంటున్నది. మంగళవారం మరో డిగ్రీ పడిపోయి 27గా నమోదైంది. ఇక రాత్రి ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. ఈ నెల మొదటి వారంలో 22–21 డిగ్రీలుగా ఉన్నా.. క్రమంగా 19 నుంచి 18కి తగ్గాయి. మంగళవారం చూస్తే రాత్రి ఉష్ణోగ్రతలు 16 డిగ్రీలుగా నమోదయ్యాయి. తెల్లవారు జామున చలి తీవ్రతకు తోడు మంచు కురుస్తుండడంతో మరింత కనిష్టానికి పడిపోతున్నాయి. రెండు మూడు రోజులుగా గాలిలో తేమ శాతం 40 నుంచి 53కు పెరుగుతూ వస్తున్నది. మంచు 11 సెల్సియస్‌గా నమోదవుతున్నది. ఈ నెల మొదటి వారం నుంచే ఉత్తరాది నుంచి శీతల పవనాలు వీస్తున్నాయి. ఈ గాలుల ప్రభావం గంటకు 2 కిలోమీటర్ల వరకు ఉండగా, చలి గాలులు భయపెడుతున్నాయి. రాత్రి సమయాల్లో ప్రభావం మరింత ఎక్కువగా ఉంటున్నది. వచ్చే వారం వరకు చలి తీవ్రత ఇలాగే ఉండొచ్చని వాతావరణ శాఖ చెబుతున్నది. అంచనా ప్రకారం.. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21న 28–15, 22న 28–16, 23న 29–17, 24న 28–18, 25న 28–18 నమోదయ్యే అవకాశమున్నది. మరోవైపు చలి తీవ్రతతో జనం ఇబ్బందులకు గురవుతున్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. దగ్గు, జలుబు, జ్వరాల వంటి ప్రభావానికి లోనవుతున్నారు. ఆస్తమా, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు మరింత ఇబ్బంది పడుతున్నారు. ఈ కొద్ది రోజులు తగిన జాగ్రతలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటికి రావద్దని సూచిస్తున్నారు.

## ఇల్లంతకుంట పాఠశాలకు గోల్డెన్ అవార్డు

ఇల్లంతకుంట, డిసెంబర్ 20: ఇల్లంతకుంట స్కూల్‌కు గోల్డెన్ అవార్డు వరించింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇందన పొదుపు మంత్రంగా విద్యుత్, సౌరశక్తి వినియోగంపై విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులకుగాను ఈ పురస్కారం వరించింది. కాగా, బుధవారం హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవనంలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి చందన్ మిత్ర చేతుల మీదుగా హెచ్‌ఎం ప్రేమలత, నోడల్ అధికారి మహేశ్ చంద్ర గోల్డెన్ అవార్డును అందుకున్నారు.



హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న ప్రధానోపాధ్యాయురాలు, నోడల్ అధికారి మహేశ్ చంద్ర

# అప్పుల కంటే.. ఆస్తులే ఎక్కువ



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

- కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా..?
- కేసీఆర్ సొంత పనుల కోసం కాదు.. ప్రజా సంక్షేమానికే నిధుల వినియోగం
- హస్తం పార్టీ ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరిస్తున్నది
- శ్వేతపత్రం పేరిట అసత్య ప్రచారం చేస్తున్నది
- ఎన్నికల్లో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చింది
- ఆరు గ్యారంటీల్లో రెండింటినీ అమలు చేశామని కట్టుకథలు చెబుతున్నది
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ధ్వజం

కరీంనగర్, డిసెంబర్20 (నమస్తే తెలంగాణప్రతినిధి) : 'కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులకంటే, సృష్టించిన ఆస్తుల విలువే అధికంగా ఉన్నది. కానీ, కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో అబద్ధాలు చెప్పినట్టే.. ప్రభుత్వంలోనూ వాస్తవాలు వక్రీకరిస్తున్నరు. కేసీఆర్‌ను ప్రజల్లో అబాసుపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నరు' అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ ధ్వజమెత్తారు. ఇప్పటికైనా అప్పుల గురించి చెప్పినప్పుడు.. వాటి ద్వారా సమకూరిన ఆస్తుల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. అంతే తప్ప ఎన్నికల సమయంలో అబద్ధాలు చెప్పినట్టు ఇప్పుడు అలాగే చేస్తే ఎవరూ ఊరుకోరని స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రతిమ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిందని, అయితే ఆరు గ్యారంటీలను ముందు పెట్టి అందులో రెండింటినీ అమలు చేశామని పచ్చి అబద్ధాలు చెబుతున్నదని మండిపడ్డారు. నిజానికి ఆరు గ్యారంటీల్లోని మహాలక్ష్మి పథకం కింద కేవలం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించారన్నారు. ఇదే పథకం కింద ఇంకా మహిళలకు నెలకు ₹2500 ఇవ్వడంతోపాటు ₹500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వాల్సి ఉందన్నారు. రైతు భరోసా కింద రైతులకు సహాయం చేస్తున్నట్లు చెబుతున్నారని, కానీ కౌలు రైతులకు ఎకరాకు ₹15వేలు, అలాగే వ్యవసాయ కూలీలకు ₹12వేలు, వరి పంటకు ₹500 బోనస్ ఇంకా అమలు చేయలేదన్నారు. పేరుకు ఆరు గ్యారంటీలు అని కనిపిస్తున్నా, అందులో 13 హామీలు ఉన్నాయని, వాటన్నింటినీ అమలు చేయాల్సి ఉందన్నారు. ఈ విషయం చెప్పకుండా ఆరు గ్యారంటీల్లో రెండు అమలు చేశామంటూ ప్రచారం చేసుకుంటున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. వంద రోజుల తర్వాత ప్రజలు తప్పకుండా హామీలపై కాంగ్రెస్ నాయకులను నిలదీస్తారని పేర్కొన్నారు. ఈ పథకాలను అమలు చేసే అంశంపై దృష్టి పెట్టాల్సిన కాంగ్రెస్, ఇప్పుడు కేసీఆర్ సర్కారు అప్పులు చేసిందంటూ అబాసుపాలుచేసే ప్రయత్నం చేస్తున్నదని దుయ్యబట్టారు. నోరు తెరిస్తే చాలు అప్పు అప్పు అని అరుస్తున్న ఆ పార్టీ, మరి ఆ అప్పు ఎందుకు చేశారు? వాటి ద్వారా చేకూరిన ప్రయోజనాలు ఏమిటీ? నాటి తెలంగాణకు నేటికి పరిస్థితుల్లో వచ్చిన మార్పులు ఏమిటీ? పెట్టిన ఇన్వెస్ట్ వల్ల పెరిగిన ఆస్తులెన్ని? అనే వివరాలను ప్రకటిస్తే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయన్నారు. కానీ, ఇవేవి లేకుండా కేవలం అప్పులు, అప్పులు అంటూ దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావు, మేయర్ సునీల్‌రావు, పట్టణ అధ్యక్షుడు హరిశంకర్, నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్‌కుమార్, చొక్కారెడ్డి, జక్కుల నాగరాజు, సంపత్ ఉన్నారు.

### ఆస్తుల సంగతి చెప్పరా..?

2014లో రాష్ట్ర జీఎస్డీపీ ₹5.5 లక్షలకోట్లు. 2023 నాటికి అది ₹13.13కోట్లకు పెరిగింది. నాడు తలసరి ఆదాయం 1,24,104 ఉంటే 2023లో 151.7 శాతం పెరిగి 3,12,398కి చేరింది. ఇది వాస్తవం కాదా..? సేల్స్ టాక్స్ వసూళ్లు 2014లో ₹72,564కోట్లు కాగా, స్వరాష్ట్రంలో 161 శాతం వృద్ధితో 2023 నాటికి 72,564 కోట్లకు చేరింది. మిషన్ కాకతీయ కింద ₹5,464 కోట్లతో 21,633 చెరువులను పునరుద్ధరించడం వల్ల 8.50 టీఎంసీలసామర్థ్యం పెరిగింది. 15.05 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. దీనిపై ఖర్చు పెట్టకపోతే, ఈ రోజు ఈ ఫలాలు ప్రజలకు అందేవా..? రాష్ట్రంలో 33 జిల్లాలు ఏర్పాటు చేశాం. 30 జిల్లాల్లో ₹1649కోట్లతో కొత్త కలెక్టరేట్లు నిర్మించాం. కొత్తగా 8,578 కిలోమీటర్ల మేర రోడ్లు వేశాం. ఇవన్నీ కండ్ల ముందే ఉన్నాయి. కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా..? 2014కు ముందు 293 గురుకులాలు ఉంటే వాటి సంఖ్య ప్రస్తుతం 1022కి పెరిగింది. 'మన ఊరు– మన బడి' మొదటి విడుత కింద ₹3497కోట్లతో పనులు చేశాం. హరితహారం కింద ₹19,822 కోట్లతో 283.71 కోట్ల మొక్కలు నాటితే, ప్రస్తుతం వాటి ఫలితం విలువ ₹211 లక్షల కోట్లకు చేరింది. తెలంగాణ వచ్చిన కొత్తలో సర్కారు దవాఖానల్లో 17,400 బెడ్స్ ఉంటే, వాటిని 34వేలకు పెంచాం. ఐసీయూ కేంద్రాలను 5 నుంచి 80కు, బ్లడ్ బ్యాంకులను 28 నుంచి 56కు, డయాలసిస్ కేంద్రాలను 5నుంచి 82కు పెంచాం. హైదరాబాద్‌ను హెల్త్ హబ్‌గా మార్చాం. తొమ్మిదిన్నరేండ్ల ముందు 3 మెడికల్ కాలేజీలుంటే.. 2023 నాటికి 33 చేరుకున్నాయి. అలాగే ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 2850 నుంచి 8,515కు, అలాగే ప్రభుత్వ పరంగా చూస్తే 850 నుంచి 3,915కు పెరిగాయి. ప్రభుత్వ పీజీ సీట్లను 515నుంచి 1320కి పెంచాం. ఇవేకాదు ₹585 కోట్లతో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, 9 కమిషనరేట్ల ఏర్పాటు చేశాం. 5వేల వాహనాలను 20వేలకు పెంచాం. శాంతిభద్రతలు కట్టుదిట్టంగా ఉన్న ప్రాంతానికే పరిశ్రమలు తరలివస్తాయన్న ఉద్దేశంతో చర్యలు తీసుకుంటే.. ఇక్కడ కూడా వాళ్లకు అప్పులే కనిపించాయి? కాళేశ్వరం పథకం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వంటి ఎన్నో ప్రాజెక్టులను పూర్తి చేశాం. ఇంకా విద్యుత్‌రంగంలో పెను మార్పులు తెచ్చాం. అందులో కల్పించిన మౌలిక సదుపాయాల వల్లే 24 గంటల కరెంటు ఇవ్వగలుగుతున్నాం. 2014 నాటికి కేవలం 7,778 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం ఉంటే, అది ప్రస్తుతం 19,464కు పెరిగింది. నాడు 5661 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ వినియోగం ఉంటే నేడు 15,497 యూనిట్లకు పెరిగింది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల సంఖ్య 19,05 లక్షల నుంచి 27.87 లక్షలకు చేరింది. నిజంగా నీళ్లు లేకపోయి ఉంటే.. ఇన్ని కనెక్షన్లు ఎందుకు పెరుగుతాయి. అలాగే పాత వాటితోపాటు పెరిగిన కనెక్షన్లకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నామంటే.. అందుకు ఎన్ని వేల కోట్లు పెట్టుబడిపెట్టాల్సి వస్తుందో ప్రజలు అర్థం చేసుకోవాలి. వీటన్నింటిలో కాంగ్రెస్ నాయకులకు అప్పులే కనిపిస్తున్నాయా..? ఆస్తులు కనిపించడం లేదా..? ప్రతి రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ సర్కారు అప్పులు తెస్తే.. వాటిద్వారా కలిగిన ప్రయోజనాల గురించి ఎందుకు చెప్పకుండా అసత్య ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదు.

**- వినోద్ కుమార్**



హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

# ఆటోడ్రైవర్ల పోరుబాట

- ఉచిత బస్సు ప్రయాణ పథకంతో రోడ్డున పడ్డామంటూ ఆందోళన
- కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 20: ఆటోడ్రైవర్లు, కార్మికులు ఆందోళన ఉధృతమవుతున్నది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నది. మహాలక్ష్మి పథకానికి తాము వ్యతిరేకం కాదని, కానీ ఉచిత బస్సు ప్రయాణ పథకంతో తాము రోడ్డునపడ్డామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో జమ్మికుంట రూట్ ఆటో యూనియన్ అధ్యక్షుడు సిరికొండ శరత్, మాజీ అధ్యక్షుడు ఎస్కే ఫయాజ్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ఆర్డీఓ కార్యాలయం దాకా ర్యాలీ తీసి, ఆర్డీవో ఎస్ రాజుకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తమ పొట్ట మీద కొట్టిందన్నారు. తమకు ఉపాధి కల్పించాలని, నెలనెలా జీవనభృతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో జమ్మికుంట, హన్మకొండ, కరీంనగర్, తదితర రూట్ల ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314374

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## స్టేట్ లెవల్ మ్యాథ్స్ సెమినార్‌కు శివజ్యోతి



కార్పొరేషన్, డిసెంబర్ 20: గణిత దినోత్సవం సందర్భంగా ఎస్సీఈఆర్టీ హైదరాబాద్ వారు ప్రతి సంవత్సరం నిర్వహించే రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక సదస్సుకు జ్యోతి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్, భరోసా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు అక్కెనపల్లి శివజ్యోతి సమర్పించిన పరిశోధన పత్రం రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈనెల 22 న హైదరాబాద్ లో నిర్వహించబోయే గణిత సదస్సులో నిత్యజీవితంలో గణితం యొక్క ఆవశ్యకత అనే అంశంపై తన రీసెర్చ్ పేపర్‌ను ప్రజెంట్ చేయనున్నారు. రాష్ట్ర స్థాయికి సదస్సుకు మూడోసారి ఎంపికైన శివజ్యోతిని ఆకేనపల్లి నాగరాజు, వైశ్య నాయకులు, భరోసా సంస్థ సభ్యులు అభినందించారు.

### టీచర్ శ్రీనివాస్ సస్పెన్షన్

పెద్దపల్లి కమాన్/ జ్యోతినగర్, డిసెంబర్ 20 : విధులకు హాజరుకాని ప్రభుత్వ టీచర్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు పెద్దపల్లి డీఈవో డీ మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీపీసీ పట్టణ పరిధిలోని నర్రశాలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ కోట శ్రీనివాస్ తన స్థానంలో వేరే ప్రైవేట్ వ్యక్తిని నియమించాడని, కొద్ది రోజులుగా గైర్హాజరవుతున్నట్టు గుర్తించామని చెప్పారు. రామగుండం ఎంఈవో సంపత్‌రావు ఇచ్చిన రిపోర్టు ప్రకారం శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశామని చెప్పారు.

# మహిళల గంజాయి దందా

- ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో బహిర్గతం
- ఇద్దరు అరెస్ట్.. 6.366 కిలోల గంజాయి స్వాధీనం
- జమ్మికుంటలో కలకలం



జమ్మికుంటలో నిందితుల అరెస్ట్ చూపుతున్న జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు, అధికారులు, సిబ్బంది

జమ్మికుంట, డిసెంబర్ 20: కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో గంజాయి విక్రయిస్తూ ఓ వర్గానికి చెందిన ఇద్దరు మహిళలు పట్టుబడడం కలకలంరేపింది. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో 6.366 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు బుధవారం జమ్మికుంట ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, వివరాలు వెల్లడించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన ఓ మహిళ కొంతకాలంగా గంజాయిని విక్రయిస్తున్నది. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన మరో మహిళకు ఆమెతో వ్యాపార సంబంధాలున్నాయి. ఇద్దరూ జమ్మికుంటలో గంజాయిని తెచ్చి అమ్ముతున్నారు. ఈ సమాచారం టాస్క్‌ఫోర్స్ అధికారులకు అందింది. బుధవారం టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం కొత్తపల్లిలోని మహిళ ఇంట్లో గంజాయి ప్యాకెట్‌ను పట్టుకున్నారు. అదుపులోకి తీసుకొని గంజాయి క్రయవిక్రయాలపై విచారణ చేశారు. విచారణలో ఉప్పల్‌కు చెందిన మహిళ పేరును వెల్లడించడంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ₹లక్షా 75వేల విలువజేసే 6.366కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అరెస్టు చేసి స్థానిక ఎక్సైజ్ పోలీసులకు అప్పగించామని చెప్పారు. కాగా, స్థానిక ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్ నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు. గంజాయి పట్టుకున్న వారిలో ఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్, కమలాకర్, ఖాసీం, తదితరులున్నారు.



కంచర బావి వద్ద నీటిని క్యాన్లలో నింపుతున్న విక్రయదారు

# పెద్దపల్లి పాతాళ గంగ.. కంచెర బావి

**శతాబ్ద కాలంగా ప్రజల గొంతు తడుపుతున్న అపురూప జలకుడ్యం పెద్దపల్లిలోని కంచెర బావి. నాడు కరువు కాటకాల సమయంలో కంచెర కులస్తులు తవ్వించిన ఈ బావి, చరిత్రకు అద్దంపడుతున్నది. వందేళ్లయినా చెదరని దర్పంలా.. ఇప్పటికీ తరగని జలసంపదతో అలరారుతున్నది. ఈ పాతాళ జలం తాగితే రోగాలు దరిచేరవనే నమ్మకంతో ఇప్పటికీ పలువురు తీసుకెళ్తుండగా, నీటి అమ్మకాల ద్వారా పలువురికి జీవనోపాధి చూపుతున్నది.**

పెద్దపల్లి, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ–గుండమ్మ చెరువు వద్ద ఉంటుందీ కంచెర బావి. వందేళ్ల కింద ఓ ఈ ప్రాంతంలో తీవ్ర కరువు వచ్చి, బావులు, చెరువులు, కుంటలు ఎండిపోయాయి. తాగేందుకు చుక్కనీరు దొరకని పరిస్థితి. స్థానికంగా నివాసం ఉండి కులవృత్తి చేసుకొని పొట్టపోసుకునే కంచెర కులస్తులు ఇక్కడ బావి తవ్వాలని నిర్ణయించుకున్నారు. పలువురి సాయం తీసుకొని పెద్దపల్లి శివారులోని కంచెరుల కాట్నాల (శ్మశానవాటిక) స్థలంలో దాదాపు 40రోజుల పాటు శ్రమించి 30 గజాల చేద బావిని తవ్వారు. ఆ సమయంలో పుష్కలమైన జలాలతో ఈ ప్రాంత ప్రజల దాహం తీర్చిన ఈ పాతాళ గంగ, క్రమంగా కంచెర బావిగా పేరొందింది. వేసవిలో భూగర్భజలాలు అడుగంటిపోయి చుట్టుపక్కల బోర్లు, బావులన్నీ ఎండిపోయిన సందర్భాల్లోనూ బావిలో నీళ్లు ఉండడం ఈ బావి ప్రత్యేకత. అయితే 60 ఏళ్ల క్రితం మాత్రం బావిలో నీళ్లు తగ్గిపోవడంతో మళ్లీ లోతుగా తవ్వించారని, అప్పటి నుంచి ఇప్పటివరకు అడుగంటిన దాఖలాలు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ బావి నీళ్లు మినరల్ వాటర్ కన్నా రుచిగా, స్వచ్ఛంగా.. మండువేసవిలోనూ చల్లగా ఉంటాయని చెబుతున్నారు. నీరు తాగితే మోకాళ్లు, కీళ్ల నొప్పులు రావని ఇక్కడి ప్రజలు విశ్వసిస్తున్నారు. అందుకే స్థానికులతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సైతం ఉదయం, సాయంత్రం ఇక్కడికి వచ్చి క్యాన్లలో నీటిని తీసుకెళ్తున్నారు.



ఇంటింటికీ సరఫరా చేస్తూ..

### నీళ్లతో పలువురికి జీవనోపాధి

ఈ బావి నీటి కొరత తీర్చడంతో పాటు పలువురికి జీవనోపాధిని కల్పిస్తున్నది. నీటిపై ప్రీతి ఉండి ఇక్కడికి వచ్చి తీసుకెళ్లలేని వారికి సరఫరా చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ప్రధానంగా పట్టణానికి చెందిన పది కుటుంబాలు ఇప్పటికీ ఈ బావిపై ఆధారపడే బతుకుతున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం డ్రమ్ముల్లో నీటిని తీసుకెళ్లి హోటళ్లు, కార్యాలయాలు, ఇండ్లలో విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. దూరాన్ని బట్టి డబ్బులు తీసుకుంటారు. సాధారణంగా 20 లీటర్ల క్యాన్‌కు రూ.10 తీసుకుంటారు.

### అందరికీ సప్లై చేయలేకపోతున్న



నేను 15 ఏండ్ల నుంచి ఈ కంచర బావి నీళ్లను విక్రయిస్తున్న. ప్రతి రోజూ చాలా మంది ఫోన్ చేసి నీళ్లు తెమ్మంటున్నరు. కానీ, అందరికీ సప్లై చేయలేకపోతున్న. కొన్ని కుటుంబాలైతే అసలు కంచర బావి నీళ్లు తప్ప ఏ నీళ్లు తాగరు. దాదాపు 20 కుటుంబాలు నాకు రెగ్యులర్ కస్టమర్లుగా ఉన్నరు. కొన్ని హోటళ్ల నిర్వాహకులు సైతం ఈ నీళ్లను తమ కస్టమర్లకు అందిస్తున్నరు. ఈ నీళ్లతోనే వాళ్లకు గిరాకీ వస్తున్నదని అంటున్నరు.

**- నాగరాజు, నీటి విక్రయదారు (పెద్దపల్లి)**

### నీళ్లమ్మే కుటుంబాన్ని పోషించుకుంటున్న



పెద్దపల్లిలోని ప్రజలందరూ ఇక్కడి కంచర బావి నీళ్లే తాగుతరు. ఇరవై ఏండ్లుగా ఈ నీళ్లమ్మే మాకుటుంబాన్ని పోషించుకుంటున్న. సైకిల్ రిక్షాకు ట్యాంకు ఏర్పాటు చేసుకొని ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఇంటింటికీ సరఫరా చేస్తున్న. ఇంకా చాలా మంది అడుగుతూనే ఉన్నరు. ప్రతి రోజు నాలుగు, ఐదు ట్రిప్పుల నీళ్లను విక్రయిస్తున్న. ఒక ట్రిప్పు నీళ్లు అమ్మితే నాకు రూ.200 దొరుకుతయి.

**- ఎండీ ఖాదర్, నీటి సరఫరాదారు (పెద్దపల్లి)**

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194